www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 14 అక్టోబర్ 2025 5

15 నుంచి 27 వరకు గ్రామ సభలు

ప్రజాశక్తి - మామిడికుదురు

ఉపాధి హామీ చట్టంలో 2026- 27 ఆర్థిక సంవత్సరానికి పనులు గుర్తించేందుకు ఈ నెల 15 నుంచి 27వ తేదీ వరకూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న గోగనమఠం, కరవాక, 16న మగటపల్లి, ఆదుర్రు, 18న కొమరాడ, ఈదరాడ, 21న మొగలికుదురు, గెద్దాడ, 22న నగరం, మామిడికుదురు, 23న పాశర్లపూడి, పాశర్లపూడిలంక, 24న బి.దొడ్డవరం, పెదపట్నంలంక, 25న అప్పనపల్లి, పెదపట్నం, 27న లూటుకుర్రు, మాకనపాలెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామ సభల్లో ఉపాధి హామీ చట్టంలో పనిచేసే కూలీలు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొని తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు.

క్షీణిస్తున్న ప్రజారోగ్యం

- -గ్రామాలను చుట్టిముట్టిన విషజ్వరాలు
- -ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు
- -ప్రయివేటు యాజమాన్యాల దోపిడీ

ప్రజాశక్తి - రాజోలు

వాతావరణంలో మార్పులు..వర్షాలతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పారిశుధ్యం పడకేయడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. జ్వరపీడుతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వ వైద్యం సక్రమంగా అందక.. ప్రయివేటు ఆస్పత్రులకు క్యూ కట్టాల్సి వస్తోంది.

పల్లె, పట్టణమనే తేడా లేకుండా జ్వరమొచ్చింది. వాతావరణ మార్పుల కారణంగా 'వైరల్' వెంటాడుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు, గోదావరికి సంభవిస్తున్న వరదలతో ఈ పరిస్థితి వచ్చింది. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య సమస్య వేధిస్తోంది. దోమలు పెరగడంతో జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఇంట్లో ఒకరి తరువాత మరొకరికి విష జర్వాలు రావడంతో ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి వచ్చింది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ వైద్యం దూరమైంది. జిల్లాలో మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీ, 385 గ్రామాలు ఉన్నాయి. 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7 సామాజిక ఆరోగ్య పోషక కేంద్రాలు, రెండు ఏరియా ఆసుపత్రులు పని చేస్తున్నాయి. ఇక్కడకు రోజూ సరాసరిన సుమారు వెయ్యి వరకూ కేసులు వస్తున్నాయి. ఇందులో సీజనల్ జ్వరాలు, అంటు వ్యాధుల బారిన పడిన వారే అధికంగా ఉంటున్నారు. అలాగే జిల్లాలోని ప్రయివేట్ ఆసుపత్రుల్లో నిత్యం వందలాది మంది వైరల్ జ్వరాలతో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందక, తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయివేట్ వైద్యాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. దీనివల్ల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయని అంటున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతివారం డ్రైడే ఫ్రైడే, స్వచ్ఛంధ్ర తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పారిశుధ్య లోపం కారణంగా జ్వరాల కేసులు ఎక్కడా తగ్గడం లేదు.

వాతావరణంలో మార్పులు

గత కొన్ని రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం కాసేపు పొడిగా.. ఆ తర్వాత వేడి, సాయంత్ర వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజులుగా జిల్లాలో పెద్దగా ఎండలు కనిపించడం లేదు. అమలాపురం, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, గన్నవరం మండలాల్లో ఎండ ప్రభావం పెద్దగా కనిపించడం లేదు. రామచంద్రపురం, ముమ్మిడివరం, కాట్రేనికోన పరిధిలో కూడా చల్లదన ప్రభావం కనిపిస్తోంది. దీనికితోడు కురిసిన వర్షాలకు దోమల ప్రభావం అధికమవుతోంది. జిల్లాలో పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్య సమస్య తాండవిస్తోంది. డ్రయినేజీలు శుభ్రం చేయక, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించక దోమలు వ్యాప్తి అధికమవుతోంది. దీనివల్ల ఇటీవల కాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధికంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి. గత ఏడాది 1,041 అనుమానిత డెంగీ కేసులు నమోదైతే, అందులో 15 పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు 30 వరకూ 118 అనుమానిత కేసులు వస్తే, ఇప్పటికే 11 పాజిటివ్‌గా గుర్తించారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 2.16 లక్షల మందికి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేస్తే, అధికారికంగా రెండు కేసులు పాజిటివ్‌గా తేల్చారని తెలుస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో మందులు ఉండటం లేదని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రయివేట్ ల్యాబ్లో చేయించుకోమంటున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జ్వరం, జలుబు, దగ్గు అధికం

వీడని జలుబు, దగ్గు తీవ్రతతో రోగులు అల్లాడిపోతున్నారు. విషజ్వరాలు పంజా విసురుతున్నాయి. ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వాస్పత్రి, ఆరోగ్య కేంద్రాల్లో సరైన చికిత్స అందక ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో జ్వరం కేసుల సంఖ్య అధికారులు పరిగణలోకి తీసుకోవడం లేదు. కేవలం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు వచ్చే కేసుల వివరాలే లెక్కల్లోకి ఎక్కుతున్నాయి. చాలామంది గ్రామాల్లో ఆశ వర్కర్లు, ఎఎన్ఎంలు, మెడికల్ షాపుల్లో వద్ద మందులు, మాత్రలు తీసుకుని.. మంచానికి పరిమితమవుతున్నారు. జ్వరం తీవ్రత అధికమైతే తప్ప ఆస్పత్రికి వెళ్లడం లేదు. చాలా మంది వైరల్ ఫీవర్ బారిన పడుతున్నారు. చిన్నపిల్లలు తీవ్ర జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పితో బాధపతున్నారు. మరికొందరు జ్వరం, ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందులు పడుతూ ఇన్ పేషెంట్లుగా చేరుతున్నారు.

ప్రయివేటు ఆసుపత్రుల్లో నిలువు దోపిడీ

జ్వరాలు విజృంభిస్తుండడంతో ఇదే అదునుగా ప్రయివేటు ఆస్పత్రులు బాధితులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. ప్లేట్‌లేట్స్ తగ్గాయని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కచ్చితంగా అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని బాధేస్తున్నాయి. చిన్నపాటి జ్వరంతో వెళ్లినా ఐసియులో ఉంచి టెస్టులు, చికిత్స పేరిట వేలల్లో బిల్లులు గుంజేస్తున్నాయనే అభిప్రాయాలు రోగులు వ్యక్తం చేస్తున్నారు.

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పిజిఆర్ఎస్‌లో 110 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 110 అర్జీలను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జెసి టి.నిశాంతి, డిఆర్ఒ కె.మాధవి, డ్వామా పీడీ మధుసూదన్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌కు వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అర్జీదారులతో సంబంధిత శాఖ అధికారి మర్యాదగా ప్రవర్తించాలని, ఎండార్స్‌మెంట్ తప్పకుండా ఇవ్వాలని తెలిపారు. వ్యవహార శైలి, పరిష్కార సరళి, విధానం సరిగ్గా లేదన్న అభిప్రాయం అర్జీదారుల నుంచి ఎట్టిపరిస్థితుల్లోనూ రాకూడదని ఆయన స్పష్టం చేశారు. రీ ఓపెన్ చేసిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. గడువు దాటిన అర్జీలు లేకుండా సకాలంలో క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. అన్ని అంశాలకు సంబంధించిన అర్జీల పరిష్కారంలో సంతృప్తకర స్థాయిని పెంచాల న్నారు. విజన్ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నియోజకవర్గ దార్శనిక కార్యాచరణ ప్రణాళిక యూనిట్ క్రియాశీలతకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్‌తోపాటు కీలక ప్రగతి సూచికల సాధనకై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి జి.మమ్మీ, డిఇఒ షేక్ సలీం భాష, వ్యవసాయ శాఖ జెడి బోసుబాబు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎవిఎస్.రామన్, డిఇ పద్మనాభం డిఎస్ఒ ఎ.ఉదయభాస్కర్, జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్థక అధికారి వెంకట్రావు, ఎండిఎం కేశవవర్మ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యశాస్త్రి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఐ.పోలవరం

సుమారు నాలుగు దశాబ్దాలపాటు విద్యారంగానికి వాకపల్లి బాలకృష్ణ వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి అందించిన సేవలు అభినంద నీయమని ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి కొనియాడారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య శాస్త్రి పదవీ విరమణ అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా వివిధ హోదాల్లో వందలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని అన్నారు. ఎంతో మంది విద్యార్థులకు ఉద్యోగాల సాధనలో తోడ్పాటు నందించారని కొనియాడారు. అనంతరం సుబ్రహ్మణ్య శాస్త్రి దంపతులను ఘనంగా సత్కరించారు. యుటిఎఫ్ నాయకుడు వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఇఒ కొండారెడ్డి, జడ్‌పిటిసి సభ్యులు ముదునూరి సతీష్‌రాజు, ఎంపిపి మోర్తా రాణి మిరియం జ్యోతి, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.కేశవరావు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు అప్పాడి వెంకటేశ్వరరావు, జెవివి మామిడికుదురు మండల ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సత్కార గ్రహీతను అభినందిస్తున్న ఎంఎల్‌సి గోపిమూర్తి

నేషనల్ ఉషు పోటీలకు జొన్నాడ విద్యార్థి

ప్రజాశక్తి - ఆలమూరు

జాతీయస్థాయి ఉషు పోటీలకు మండలంలోని జొన్నాడకి చెందిన విద్యార్థి కర్రి నాగ సంతోష్ ఎంపికయ్యాడని మార్షల్ ఆర్ట్స్ కోచ్ కె.సత్తిబాబు తెలిపారు. ఈనెల 11, 12 తేదీలలో రాజమహేంద్రవరం ఎస్‌కెవిటి కళాశాలలో జరిగిన గవర్నమెంట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉషు పోటీల్లో స్థానిక జడ్‌పి హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి నాగసంతోష్ 60 కేజీల విభాగంలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి అత్యంత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడని తెలిపారు. ఈనెల 28న శ్రీనగర్‌లో జరిగే జాతీయస్థాయి ఉషు పోటీలలో పాల్గొంటాడని ఆయన వెల్లడించారు. విజేతను టిడిపి నాయకులు తాడి శ్రీనివాస్ రెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్ సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ సూర్యతేజరెడ్డి, కోచ్ పి.నానిబాబు పాల్గొన్నారు.

క్రీడాకారుడిని సత్కరిస్తున్న టిడిపి నాయకులు

నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైసిపి నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

రామచంద్రపురం నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. స్థానిక వైసిపి కార్యాలయం నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకూ ప్రదర్శన సాగింది. సిఐకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీల కులు చింతలపాటి శ్రీనివాస రావు, ఎంపిపి అంబటి భవాని, మండల కన్వీనర్లు పోలినాటి ప్రసాద్, పెట్టా శ్రీనివాస్, పిల్లి కృష్ణమూర్తి, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీ, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. **కొత్తపేట** స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద అముడా మాజీ ఛైర్మన్, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి డేవిడ్ రాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్ పాల్గొన్నారు. తొలుత గొల్లపల్లి డేవిడ్‌రాజు ఇంటి నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **అమలాపురం** స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద నియోజకవర్గం వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సిలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయేల్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో వినతిపత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

కల్తీ మద్యం మాఫియాపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కల్తీ మద్యం మాఫియా కార్యకలాపాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న సంఘ విద్రోహ శక్తులపై ప్రభుత్వం తక్షణమే ఉక్కుపాదం మోపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నకిలీ మద్యం బయటపడిందని, నకిలీ మద్యం నియంత్రణకి సిట్ కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. నకిలీ లేబుళ్లు, రంగులు, రసాయనాలతో తయారు చేయబడుతున్న ఈ కల్తీ మద్యం కారణంగా సామాన్య ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం ఆదాయాన్ని మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా, మద్యం నాణ్యతను పర్యవేక్షించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున కల్తీ మద్యం తయారీ యూనిట్లు నడుస్తున్నా, ఎక్సైజ్, పోలీసు ఇంటెలిజెన్స్ వ్యవస్థలు ఏం చేస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వంలోని పెద్దల అండదండలు లేకుండా ఈ మాఫియా ఇంతకాలం చెలరేగిపోవడం అసాధ్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా కల్తీ మద్యం విక్రయాలు జరగకుండా ఎక్సైజ్ శాఖ తనిఖీలను ముమ్మరం చేయాలని, పట్టుబడిన కల్తీ మద్యం తయారీదారుల వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం,కల్తీ మాఫియాను అరికట్టడం కోసం సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, బలరాం, టి.నాగవరలక్ష్మి, కె.కృష్ణవేణి నాయకులు పీతల రామచంద్రరావు, తాడి శ్రీరామ్మూర్తి, సఖిలే సూర్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకుడు వెంకటేశ్వరరావు

ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - అమలాపురం

నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల నిర్వహించిన డిఎస్‌సిలో ఉత్తమంగా రాణించి ఉపాధ్యాయులుగా ఎంపికై సోమవారం విధుల్లో చేరిన వారికి సిపిఎం పక్షాన అభినందనలు తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా ప్రభుత్వం డిఎస్‌సిని నిర్వహించిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెడుతున్న ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో, సామాజిక న్యాయాన్ని పెంపొందించడంలో అంకితభావంతో పనిచేయాలని సిపిఎం ఆకాంక్షిస్తుందని అన్నారు. రాష్ట్రంలో 50 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం కేవలం 16,500 పోస్టులనే డిఎస్‌సి ద్వారా భర్తీ చేసిందని అన్నారు. జనవరిలో మరొక 35 వేల పోస్టులు భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని, బ్లాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌ని విడుదల చేసి పోస్టులు భర్తీ చేయాలని కోరారు. నూతన ఉపాధ్యాయులు పని చేయబోయే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులను, తగినంత సంఖ్యలో ఇతర బోధన, బోధనేతర సిబ్బందిని వెంటనే నియమించాలని కోరారు.

టైక్వాండో పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - అంబాజీపేట

వ ం జా బ్ లో జరగబోయే జాతీయ స్థాయి టైక్వాండో స్కూల్ గేమ్స్ పోటీలకు అంబాజీపేట హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని సీనియర్ కోచ్ పి.త్రిమూర్తులు తెలిపారు. ఈ నెల 10, 11, 12 తేదీలలో బాపట్లలో జరిగిన టైక్వాండో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ 20 కేజీల విభాగంలో కుడుపూడి కావ్యసుందరి హరిప్రియ మొదటి స్థానం, 24 కేజీల విభాగంలో యేరుబండి ఇషా నాగశ్రీనిజ రెండవ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని తలెఇపారు. ఈ సందర్భంగా విజేతలను హైస్కూల్ హెచ్ఎం కె.సాయిరాం, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అభినందించారు.

క్రీడాకారులతో కోచ్ త్రిమూర్తులు

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - పి.గన్నవరం

మండలంలోని యర్రంశెట్టి వారిపాలెం గ్రామంలో అంటువ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా చేపట్టిన పారిశుధ్య పనులను సర్పంచ్ యర్రంశెట్టి త్రివేణి సోమవారం పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రం చేయించి గ్రామమంతా గత రెండు రోజుల నుంచి బ్లీచింగ్ చల్లిస్తున్నామని పంచాయతి కార్యదర్శి ఎ.రమేష్ తెలిపారు. దోమల నిర్మూలనకు ఎబేట్ మందు స్ప్రే చేయించామన్నారు. పరిసరాలను ఎవరికి వారు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్య ఆరోగ్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ త్రివేణి

సైన్స్ సంబరాల బ్రోచర్ విడుదల

ప్రజాశక్తి - ఆత్రేయపురం

స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో సోమవారం చెకుముకి సైన్స్ సంబరాల బ్రోచర్‌ను ఎంఇఒలు పి.వి.వర ప్రసాద్‌రావు, ఎ. సత్యన్నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు చింతా శ్యామ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో అక్టోబర్ 18న, మండల స్థాయిలో నవంబర్ 1న, జిల్లా స్థాయిలో నవంబర్ 23న రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున చిన్నారుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, తార్కిక ఆలోచనని పెంపొందించడానికి, పోటీ తత్వాన్ని అలవర్చడానికి ప్రతి పాఠశాలలో ఈ పోటీలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షుడు ప్రసాద్, నాయకులు ఎం.రవి, రామకృష్ణ, సుధాకర్, వాసుకి, గోవిందు, వరప్రసాద్, పాల్గొన్నారు.

బ్రోచ్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, యుటిఎఫ్ నాయకులు

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

సిఎం చంద్రబాబు చేతుల మీదుగా పారిశుధ్య అవార్డులను అందుకున్న లొల్ల సర్పంచ్ కాయ జగన్నాథం, కార్యదర్శి కృష్ణమాచార్యులు, పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి కుండా అన్నపూర్ణ, జడ్‌పిటిసి బోనం సాయిబాబా, వైస్ ఎంపిపి బంగారాజు, ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్‌రామన్, తహశీల్దార్ టిఆర్.రాజేశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ చంద్రశేఖర్ అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో పారిశుధ్య సమస్య లేని గ్రామంలో మొదటి స్థానం సాధించడంపై ఎంపిపి అన్నపూర్ణ హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న అధికారులు

కార్టూ'నిజం'



అభివృద్ధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కేంద్ర బృందం సోమవారం పరిశీంచింది. మండలంలోని భీమనపల్లిలో ఉపాధి హామీ చట్టంలో నిర్మించిన సిసి రోడ్లు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉమేష్‌కుమార్‌రామ్, ఎస్ఒ మయూర్ వర్మ బృందం తనిఖీలు నిర్వహించారు. పిఎంఎవై గ్రామీణ గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ పర్యటనలో డ్వామా ఎపిడి డి. రాంబాబు, పంచాయతీరాజ్ ఇఇ పి.రామకృష్ణారెడ్డి, డిఇఇ పిఎస్.రాజ్‌కుమార్, హౌసింగ్ డిఇఇ జె.సత్యనారాయణ, ఎంపిడిఒలు డి.కృష్ణ, జివి.సరోవరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఘనంగా తోరాటి జయంతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని అంగరకు చెందిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు తోరాటి లక్ష్మణమూర్తి 99వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం వద్ద పలువురు స్మారక స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం అంగర గాంధీ సెంటర్లోని లక్ష్మణ మూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంగర, పడమర ఖండ్రిక సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వర రావు, ఎంపిహెచ్ఇఒ జిత్తుగ మల్లికార్జునుడు తదితరులు లక్ష్మణమూర్తి పోరాటస్ఫూర్తిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కరాటపు వెంకటేశ్వరరావు, తోరాటి బాబులు, ముత్తా అబ్బు, పెద్దింశెట్టి సూర్యచంద్రరావు, యానాల సీతారామయ్య, మేడిపల్లి కొండ, పసలపూడి కృష్ణ, వై.సుబ్బారావు, డి.సత్తిపండు పాల్గొన్నారు.

నారసింహ అలంకరణలో ఊరేగుతున్న శ్రీనివాసుడు

వైభవంగా శ్రీనివాస కల్యాణం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం 5వ రోజు శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. పండితులు ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము, అష్టకళశారాధనలను నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు దంపతులు, ఆలయ డిసి నల్లం సూర్యచక్రధర దంపతులు ఎంఎల్ఎ బండారు సత్యానందరావు తరపున పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు ఉదయం నుంచే యాత్రికులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సంస్కృతి కార్యక్రమాలు అలరింప చేశాయి. రాత్రి 8 గంటలకు యోగ నారసింహ అలంకరణలో సింహవాహనపై శ్రీనివాసుడు ఆలయ మాడవీధులలో విహరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాడి యేసుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

జిల్లా ఎన్‌జిఒ అడహక్ కమిటీ కో ఛైర్మన్‌గా ఎంపికైన సఖినేటిపల్లి గ్రామ కార్యదర్శి తాడి యేసును ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యేసు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు, పిఆర్‌సి, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సచివాలయు ఉద్యోగుల ఇంక్రిమెంట్, డిఎ బకాయిలు తదితర అంశాలపై జిల్లా అడహాక్ కమిటీ ఛైర్మన్ మాధవరావు వెంకటేశ్వర్లు, సంఘం రాష్ట్ర నాయకులతో కలిసి రాజీ లేని పోరాటం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు బళ్ల నోబుల్ ప్రభాకర్, స్థానిక నాయకులు పులగం రమేష్, నామన వెంకట్, ఎం.మురళీ, కె.నాగేశ్వరావు సిబ్బంది పాల్గొన్నారు.

డిసిఎం పవన్ పర్యటనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - అమలాపురం

ఈనెల 17న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లె పండుగ 2.0 పనులను రాజోలు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పవన్ పర్యటనపై సోమవారం కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ మాట్లాడుతూ డిప్యూటీ సిఎం మొదటిసారిగా రాజోలు నియోజకవర్గంలో పర్యటనకు వస్తున్నారని అన్నారు. ఆయన పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. శంకరగుప్తం మురుగు కాలువ విధ్వంసంతో 15 గ్రామాల్లో ఉప్పు నీరు పైకి రావడం, డ్రయినేజీలో పూడికను తొలగించకపోవడవంతో మురుగునీరు పైకి పొంగి సుమారు లక్ష కొబ్బరి చెట్లు చనిపోయి రైతులు తీవ్రమైన ఇక్కట్లను ఎదుర్కొన్నారన్నారు. ఇటీవల సంబంధిత డ్రయిన్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు సందర్శించి పూడికతీతకు రూ.9.70 కోట్ల నిధులు, గట్ల ఆధునికీకరణకు రూ.6 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. దీనిపై డిసిఎంతో చర్చించగా, సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించేందుకు పవన్ అంగీకరించారని అన్నారు. ఈ నేపథ్యంలో పల్లె పండుగ 2.0 పనులను ప్రారంభించేందుకు ఆయన రానున్నట్లు తెలిపారు. డిసిఎం తొలుత కేసనపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకొని బ్రిడ్జ్ వ్యూపాయింట్ నుంచి డామేజీనీ పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం రైతులతో ముఖాముఖిగా మాట్లాడతారని చెప్పారు. అనంతరం ములుగుపల్లి సెంటర్ చేరుకొని కాత్రేనిపాడు లంక వద్ద 7 గ్రామాలకు రోడ్డు వేయుటకు రూ 3.20 లతో శంకుస్థాపన చేస్తారని తెలిపారు. నరేగా అనుసంధానంతో కలెక్టర్ ప్రతిపాదించిన పనులకు శంకుస్థాపన చేస్తారని వివరించారు. శివకోడు జాతీయ రహదారి సమీపంలో ఏర్పా టుచేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొంటారని తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ హెలిప్యాడ్, బహిరంగ సభ వేదిక వద్ద శాంతిభద్రతల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఎస్‌పి రాహుల్ మీనా, డిఆర్ఒ కె.మాధవి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గోకవరం

గోకవరంలోని ఆర్అండ్ఆర్ కాలనీ ప్లాట్‌ఫామ్‌పై వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుడు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్న కోరుకొండ గ్రామానికి చెందిన రెడ్డిచర్ల నరసింహరాజు(39)గా పోలీసులు గుర్తించారు. భార్యతో విభేదాల నేపథ్యంలో ఆయన గోకవరం వచ్చాడు. పరిసర గ్రామాల్లో హోమ్‌నీడ్స్ వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో ఇద్దరు నిందితులను సీతానగరం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. రఘుదేవపురం గ్రామానికి చెందిన మానుపాటి దుర్గాప్రసాద్ సెప్టెంబర్ 3న రఘుదేవపురం గ్రామంలో బూరలు వారి గుడి వద్ద వీర ఏసురాజుకు డబ్బులు ఫోన్ పే చేయడానికి బండికి స్టాండ్ వేశారు. అక్కడ నిలబడి ఫోన్ పే చేస్తుండగా అదే గ్రామానికి చెందిన తాడి దుర్గా సిద్దా కోటేశ్, సూరి లక్ష్మణ్ కలిసి దుర్గాప్రసాద్‌ను కులం పేరుతో దూషించారు. అతని భార్య పట్ల అసభ్యకరంగా మాట్లాడారు. అంతేకాకుండా వారిపై దాడికి పల్పడ్డారు. ఈ మేరకు దుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ నిందితులైన సిద్దా కోటేశ్, సూరి లక్ష్మణ్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సోమవారం నార్త్ జోన్ డిఎస్‌పి శ్రీకాంత్ విచారణ జరిపి నిందితులను అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

కాలేజీ బస్సును ఢీకొన్న వ్యాన్

13 మంది విద్యార్థులకు స్వల్పగాయాలు

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలో కృష్ణంపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 13 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాడేపల్లిగూడెంలోని శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సులు ఎప్పటిలానే విద్యార్థులను ఎక్కించుకుని బయలుదేరింది. ఈ బస్సు కృష్ణంపాలెం వద్దకు చేరుకునే సరిగా బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో 13 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని స్థానికులు వెంటనే దేవరపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 50 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. ఈ ప్రమాదంలో బొలెరో వాహన డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి, క్లీనర్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్‌ను రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం నుజ్జునుజ్జయ్యింది. దేవరపల్లి పోలీసులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని రామేశ్వరంపేటలో ఆదివారం రాత్రి బైకు ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన గెడ్డం త్రిమూర్తులు (38) సూరంపాలెం ఆదిత్య కాలేజ్ క్యాంటీన్‌లో కూలి పని చేసుకుని జీవిస్తున్నాడు. రామేశంపేట సెంటర్ నుంచి కాలేజీకి నడుచి వెళు తుండగా రాత్రి 9 గంటల సమయంలో వెనుక నుంచి ఒక బైకు వేగంగా ఢీ కొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో త్రిమూర్తులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివనాగు తెలిపారు.

జూనియర్ కళాశాలకు విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కొత్తపేట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు విరాళాన్ని అందజేశారు. కళాశాలకు అవసరమైన ఆర్ఒ ప్లాంట్‌తోపాటు, జిరాక్స్ మెషిన్, కళాశాల మరమ్మతుల నిమిత్తం రూ.2 లక్షల విరాళాన్ని సోమవారం కళాశాల ప్రిన్సిపల్ నల్లమిల్లి సురేష్‌రెడ్డికి అందజేశారు. కళాశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దాత పాపారావును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగీత సుభాష్, నేతలు గుణ్ణం వీర్రాజు, గన్ని విష్ణు, గారపాటి త్రిమూర్తులు, కాలా సాయిబాబు, వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ఎస్‌సి పేటల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. సోమవారం అమలాపురంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ నిశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈదరాడలో కమ్మవారి లంక, కలింగులపేట ఎస్‌సి ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాలను చేపట్టాలని కోరారు. 2006లో గ్రావెల్ రోడ్డు వేశారని అప్పటినుంచి రోడ్డు ఆధునీకరణకు నోచుకోక అధ్వన్నంగా మారిందన్నారు. తక్షణమే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు నూటుకుర్తి సత్యనారాయణ, ప్రతినిధులు యార్లగడ్డ రవి, నామవరపు చిన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

భూముల కోసం ధర్నా

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

దళితులకు కేటాయించిన భూములను సర్వే చేసి అప్పగించాలంటూ ధర్నా జరిగింది. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎపి రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శి కొండా దుర్గారావు మాట్లాడారు. మండలంలోని బోళ్ళంకలో 1986లో సుమారు 50 ఎకరాల భూమిని దళితులకు కేటాయించడం జరిగిందన్నారు. ఆ భూమిని సాగులో తీసుకొచ్చిన తర్వాత అగ్రకులాలకు చెందినవారు దళితులను భూముల నుంచి తరిమేశారని ఆరోపించారు. దీనిపై సర్వే చేసి భూములను ఆక్రమించుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి దళితులకు భూమిని అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ, డిటిలకు వినతి పత్రం అందజేశారు.

సమస్యలపై ప్రజాప్రతినిధుల ఏకరువు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలపై ఏకరువు పట్టారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపిపి కుండా అన్నపూర్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లో నెలకున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నార్కెడిమిల్లి సర్పంచ్ పాల నాగేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీలకు రావలసిన స్టాంపు డ్యూటీ రావట్లేదని, గత సమావేశాల్లో ఇదే అంశంపై చర్చించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తమ గ్రామంలో విద్యుత్ లైన్‌మ్యాన్ అందుబాటులో ఉండడం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని ఎఇ అశోక్‌కుమార్ పై మండిపడ్డారు. వైస్ ఎంపిపి బంగార్రాజు మాట్లాడుతూ వసంతవాడ రైతుల పంట పొలాల్లోని బోరు బావులకు విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న మీటర్లు ఇవ్వ లేదని నిలదీశారు. వెలిచేరు సర్పంచ్ వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ జడ్‌పి హెచ్ఎస్ పాఠశాలలో అదనపు గదులు నిర్మించి మధ్యలోనే నిలిపివేశారని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. జడ్‌పిటిసి బోనం సాయిబాబా మాట్లాడుతూ లొల్ల నుంచి ర్యాలీ వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు చెంతని ఉన్న పచ్చని చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా నరి కేసి ఇటుక బట్టీలకు కలపను తరలించారని మండి పడ్డారు. ప్రతి గ్రామంలో యథేచ్చగా బెల్ట్ షాపులు నడు స్తున్నాయని ఎక్సైజ్ శాఖ అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. అయితే వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్‌రామన్, తహశీల్దార్ టిఆర్.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అన్నపూర్ణ

మృత్యుంజయరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రెవెన్యూ డివిజన్ ఉద్యగుల సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన రామచంద్ర పురం తహశీల్దార్ బండి మత్యుం జయరావును సోమవారం పలువురు ఘనంగా సత్కరించారు. డివిజన్ అసోసియేట్ ప్రెసిడెంట్ మేడిశెట్టి. హరి చంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులు పంపన రామారావు, డివిజన్ కోశాధికారి పి.శ్రీరాం ప్రసాద్, జాయింట్ సెక్రటరీ మురళీలను తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది, విఆర్ఒలు, విఆర్ఎలు, డీలర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మృత్యుంజయరావు మాట్లాడుతూ డిప్యూటీ కలెక్టర్ నుంచి విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌ల వరకు అందరూ అసోసియేషన్లో సభ్యులు అని అన్నారు.ఉద్యోగులకు అండగా ఉంటా నని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మాధురి, ఆర్ఐ సత్యదేవ్‌ప్రసాద్, రాష్ట్ర విఆర్ఒల సంఘం ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ, తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న మృత్యుంజయరావు

సమిష్టి కృషితో మండలాభివృద్ధి

ప్రజాశక్తి - ఆలమూరు

అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టి కృషితో మండల అభివృద్ధి అభివద్ధి సాధ్యపడుతుందని ఎంపిపి తోరాటి లక్ష్మణ రావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎ.రాజు, తాహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, కార్యాలయ ఎఒ మెహర్‌ప్రకాష్, ఎడిఎ కెవి.చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ముంపు నీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మురుగు కాలువలను ఆధునికీకరించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్‌ను రైతులు కోరారు. సోమవారం కిత్తనచెరువుతో పాటు పలు గ్రామాల్లో వర్షపు నీరు దిగక ముంపు నీటితో ఉన్న వరి చేలను ఆయన పరిశీలించారు. అలాగే రంగరాజు కోడు, ఓల్డ్ అయినాపురం, పాయకరావుకోడు, కూనవరం మేజర్ డ్రయిన్ మురుగు కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి చేల నుంచి ముంపు నీరు దిగక రైతులు పడుతున్న ఇబ్బందులను రాష్ట్ర అగ్రి మిషన్ డైరెక్టర్ అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, డిసి ఛైర్మన్ దంగేటి చిట్టిబాబు, అల్లవరం డిసి ఛైర్మన్ గోపిరాజు, డిసి వైస్ ఛైర్మన్‌లు గుత్తుల శ్రీనివాస్, బండారు వెంకటేశ్వరరావు, నీటి సంఘాల అధ్యక్షులు నల్లా సత్యనారాయణ తదితరులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ముంపునీటి సమస్యతో రైతులు పడుతున్న ఇబ్బందుల విషయాన్ని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఎల్ఎ లు అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిరాజు, కలెక్టర్ మహేష్ కుమార్‌లతో మాట్లాడి పరిష్కారానికి కషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు అడబాల సత్యనారాయణ, పెయ్యల దుర్గారావు, పెమ్మిరెడ్డి సత్యనారాయ, పెయ్యల చిట్టిబాబు, రవణం మధు, చిక్కం భీముడు, రైతులు పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపడుతున్న కోటి సంతకాల పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్, నియోజకవర్గ పరిశీలకులు చింతలపాటి శ్రీనివాసరావు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలంతా కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, మండల కన్వీనర్లు పోలినాటి ప్రసాద్, పెట్టా శ్రీనివాస్, పిల్లి కృష్ణమూర్తి, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీ, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నిల్వ చేపలు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మార్కెట్‌లో నిల్వ ఉంచిన మాంసం, చేపలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ రవివర్మ హెచ్చరించారు. సోమవారం మార్కెట్ ప్రాంతంలోని పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రెండు ఐస్ బాక్స్‌లను గుర్తించి సుమారు 15 కేజీల నిల్వ చేసిన చేపలను గుర్తించి స్వాధీనం చేసుకుని డంపింగ్ యార్డ్‌లో డంప్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలతో వ్యాధులు ప్రభలుతున్నాయని, ఈ నేపథ్యంలో కొందరు వ్యాపారులు లాభాపేక్షతో నిల్వ చేసిన మాంసం, చేపలను విక్రయించడం సరికాదన్నారు. అటువంటి వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో శానిటేషన్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులకు పిహెచ్‌సి ఉద్యోగుల మద్దతు

ప్రజాశక్తి - మామిడికుదురు

సమస్యలు పరిష్కారం కోరుతూ పిహెచ్‌సి వైద్యులు చేపట్టిన సమ్మెకు పిహెచ్‌సి ఉద్యోగులు మద్దతు తెలిపారు. సోమవారం మండలంలోని లూటుకుర్రు పిహెచ్‌సి వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేసి సంఘీభావం తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. వైద్యుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ బివి.ప్రసాద్, ఫార్మసిస్ట్ జి.దుర్గాప్రసాద్, స్టాఫ్ నర్స్ పి.వెంకటలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కామనగరువు ఆదిత్య పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల గొల్లల మామిడాడలో జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో అండర్- 14 కేటగిరిలో బివిఎన్.కల్యాణ్, అండర్ -17 కేటగిరిలో పిడి.కృష్ణవినయ్ అర్హత సాధించి రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, ఆదిత్య జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్ చలపతిరావు, పాఠశాల ప్రిన్సిపల్ బి.రామప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ జి.లక్ష్మీసుధ అభినందించారు.

నూతన ఉపాధ్యాయుల చేరిక

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలో కొత్తగా 18 మంది ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారని ఎంఇఒ కె.తాతారావు తెలిపారు. కాలేరు జడ్‌పి హెచ్ఎస్‌లో ఒకరు, అంగర ఉన్నత పాఠశాలలో ఐదుగురు, టేకి ఉన్నత పాఠశాలలో ముగ్గురు, కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాలలో ఒకరు, మాచర ఉన్నత పాఠశాలలో నలుగురు, వాకతిప్ప ఉన్నత పాఠశాలలో ఇద్దరు, ఎంపియుపిఎస్ అద్దంకివారి లంక పాఠశాలలో ఒకరు, ఎంపియుపిఎస్ నారాయణలంక పాఠశాలలో ఒకరు మొత్తం 18 మంది విధుల్లో చేరినట్లు తెలిపారు.

సిజెఐపై దాడికి ఖండన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్‌పై జరిగిన దాడిని ఎంఆర్‌పిఎస్ నాయకులు ఖండించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కెవి.మధు సవరపు భైరవమూర్తి, నూటికుర్తి సత్యనారాయణ, నేదునూరి రాజేష్, కండవెల్లి ఏలియా, ఆకుమర్తి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన కార్యక్రమాన్ని ఆలమూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండపేట సహాయ కార్మిక అధికారి నాగమల్లేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించారు.

సమాచార హక్కు చట్టంపై సదస్సు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కన్వెన్షన్ హాల్లో సోమవారం సమాచార హక్కు చట్టం 20వ వార్షికోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. దీవెన ఫౌండేషన్, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు గుమ్మళ్ళ శ్రీనివాస్‌సాగర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స.హ.చట్టం కార్యకర్త కుంచె చినబాబు స.హ.చట్టం ప్రాధాన్యతను వివరించారు. ప్రతి పౌరుడు సెక్షన్ 6(1) ద్వారా కావలసిన సమాచారాన్ని దరఖాస్తు చేసి పొందవచ్చునన్నారు. అలా కోరిన సమాచారాన్ని 30 రోజుల్లో ఇవ్వని పక్షంలో దరఖాస్తుదారుడికి అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఆయా సంస్థల ఆధ్వర్యంలో చినబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెనుమాల సుధీర్, కాశి వెంకటాచారి, కన్నిడి వెంకటేశ్వరరావు, తాటిపాక దుర్గబాబు, యలమంచిలి సురేష్, పి.రవికుమార్, ఎం.రాంబాబు, వి.లక్ష్మీ నారాయణ, జంగా చిట్టిబాబు, శరత్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య బాణసంచా నిల్వలు తగదు

ప్రజాశక్తి - మండపేట

జనావాసాల మధ్య బాణసంచాను నిల్వ చేసినా, అనుమతులు లేకుండా విక్రయాలు చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎన్.రాము హెచ్చరించారు. సోమవారం పట్టణంలో పలు ఇళ్లను, షాప్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్‌లు పొందినప్పటికీ జనావాసాల మధ్య బాణసంచాను ఉంచరాదన్నారు. నిబంధనలు మేరకు నిర్దేశించిన సురక్షిత ప్రదేశాల్లో మాత్రమే వీటిని ఉంచాలన్నారు.

సూర్యప్రకాష్‌ను సత్కరించిన శ్రీకాంత్

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అమలాపురం నియోజకవర్గ వైసిపి ఆర్‌టిఐ విభాగం అధ్యక్షులు నల్లా సూర్య ప్రకాష్‌ను నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, విలసవిల్లి వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, వైసిపి నాయకులు నల్లా నాయుడు, నల్లా ఆదినారాయణ, కోరుకొండ కిరణ్ పాల్గొన్నారు.

దీక్షకు బిఎస్‌పి సంఘీభావం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్ స్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలంటూ చేపట్టిన దీక్షకు బిఎస్‌పి నాయకులు సంఘీభావం తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ చేపట్టిన రిలే దీక్షా శిబిరాన్ని బిఎస్‌పి నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి ఆస్తుల పరిరక్షించడంలో అధికారులు నిర్లక్ష్యాని వీడాలని డిమాండ్ చేశారు. నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్‌స్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు వాకపల్లి భీమారావు, బడుగు భీమేశ్వరరావు, దాసరి శ్రీనివాస్, పందిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, VASAMSETTI SRINIVAS, S/o Satyanarayana, Previously called VASAMSETTY SRINIVAS (Old Name) Resident of 1-46, Sundar Nagar Colony, Rollapalem Village, Amalapuram Mandal, Dr. B.R Ambedkar Konaseema District, Pincode - 533218. Now changed my name from **VASAMSETTY SRINIVAS** (Old Name) to **VASAMSETTI SRINIVAS** (New Name). Hence forth I will be called as **VASAMSETTI SRINIVAS** (New Name) for all purpose.

పాస్‌పోర్టు పడిపోయినది

కాకినాడ జిల్లా, రౌతులపూడి మండలం, రౌతులపూడి గ్రామ కాపురస్తులు వాసిరెడ్డి కృష్ణమూర్తి, డోర్ నెంబర్: 3-17/1, పాత బజార్, రౌతులపూడి యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ **B3628264**, తేదీ. 30-08-2001 (విశాఖపట్నం) కలది. ది. 02-08-2025వ తేదీన మా ఇంటి నుండి సినిమా థియేటర్ సెంటర్‌లో గల జిరాక్స్ షాపునకు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు తెలియచేయగలరు.

వాసిరెడ్డి కృష్ణమూర్తి
S/o. వెంకన్న దొర, డోర్ నెంబర్: 3-17/1
పాత బజార్, రౌతులపూడి - 533446
కాకినాడ జిల్లా, సెల్: 8919991611

పాస్‌పోర్టు పడిపోయినది

రొట్టె బేబి, W/o. వీరభద్రరావు, డో.నెం. 1-358, ఎస్.సి.పేట, నరేంద్రపురం విలేజ్, రాజానగరం, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 06-2-2014వ తేదీన **L6995846** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసియున్నారు. సదరు పాస్‌పోర్టు నేను ది. 14-6-2025వ తేదీన నరేంద్రపురం నుండి రాజానగరం ఆటోలో వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినది. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

రొట్టె బేబి
సెల్: 6305103669

మహారాజశ్రీ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 525/2024 in
I.A. No. 194/2024
Between:
Akula Prabhakar
Akula Suresh ***...Petitioners/ Plaintiffs***
AND
Premalatha Javar and Others ***...Respondents/ Defendants***
To:
Premalatha Javar, Hindu, age 58 yrs, D.No. 9-11-27, Opp: Ganesh Hotel, Isukaveedhi, Rajamahendravaram.

పై నెంబరు దావాలో I.A. 194/2024 Interim Injunction పిటీషను పై కోర్టులో పిటీషనర్స్ దాఖలు చేయడమైనది. సదరు పిటీషనులో 1వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకోనందున పై కోర్టు వారు పేపరు ప్రకటన ఆర్డరు వేసియున్నారు. కావున **ది. 23-10-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **కె.ఎస్.భూలోకేశ్వరరావు (భూలోక్)**
13-10-2025 అడ్వకేట్, రాజమండ్రి

ప్రకటన

తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు మండలం, నిడదవోలు పట్టణం, కాకి వారి వీధి కాపురస్తులు కాకి యర్రయ్య గారి కుమారుడు తిరుపతి బాబు గారికి చెందిన దస్తావేజు నెంబరు 60/1998 గా రాసిన వీలునామా ఒరిజినల్ కాపీ ది.08-10-2025 వ తేదీన వారి ఇంటి వద్ద నుండి మున్సిపల్ ఆఫీసు వద్ద ఉన్న జిరాక్సు షాపు వద్దకు జిరాక్సు తీయించు నిమిత్తం వచ్చుచుండగా మార్గమధ్యములో పడిపోయినది. ఆ ఒరిజినల్ దస్తావేజులు ప్రకారం ఆ ఆస్థికి మా క్లయింటు అయిన కాకి తిరుపతి బాబు సర్వహక్కుదారులై ఉన్నారు. అందువల్ల దీనికి సంభందించి ఎటువంటి లావాదేవీలు మా క్లయింటు తప్ప ఇతరులు ఎవ్వరు చేసినా అవి చెల్లుబాటుకావని ఆ దస్తావేజులు దొరికిన వారు వెంటనే ఈ దిగువ చిరునామాలో అందచేయవలసిందిగా తెలియచేస్తున్నాము.
చిరునామా : కాకి తిరుపతి బాబు, తండ్రి : యర్రయ్య, కాకి వారి వీధి, నిడదవోలు పట్టణం, నిడదవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా, సెల్ : 9618008432.
యన్.భాస్కరరావు, M.Com, B.L.
తేది: 12-10-2025 **అడ్వకేట్, నిడదవోలు**
నిడదవోలు **సెల్ : 93940 54561**

In the Court of the III Additional Senior Civil Judge at Kakinada
A.S. No. 153/2019
Between:
Sundarapalli Srinivasa Rao and another ***...Appellants***
AND
Sundarapalli Durga Rao and others ***...Respondents***
To:
R-3: Peruri Kanakam, W/o. (late) Krishna, Hindu, House wife, D.No. 10-53, Satya Durga Nagar, Toorangi, Kakinada.

పై నంబరు అప్పీలు దావాలో 3వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 22-10-2025వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై అప్పీలు మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
బోయనపల్లి రాధాకృష్ణ
ఎ.అనిల్‌కుమార్ రాజా, అడ్వకేట్స్
జవహర్ వీధి, సూర్యారావుపేట
కాకినాడ, సెల్: 9440323951

మహారాజశ్రీ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 525/2024 in
I.A. No. 66/2025
Between:
Akula Prabhakar
Akula Suresh ***...Petitioners/ Plaintiffs***
AND
Premalatha Javar and Others ***...Respondents/ Defendants***
To:
Premalatha Javar, Hindu, age 58 yrs, D.No. 9-11-27, Opp: Ganesh Hotel, Isukaveedhi, Rajamahendravaram.

పై నెంబరు దావాలో I.A. 66/2025, నెలసరి అద్దె డిపాజిట్ చేయు నిమిత్తం పిటీషనర్స్ పై కోర్టులో పిటీషను దాఖలు చేయడమైనది. సదరు పిటీషనులో 1వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకోనందున పై కోర్టు వారు పేపరు ప్రకటన ఆర్డరు వేసియున్నారు. కావున **ది. 23-10-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **కె.ఎస్.భూలోకేశ్వరరావు (భూలోక్)**
13-10-2025 అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 525/2024
Between:
Akula Prabhakar
Akula Suresh ***...Plaintiffs/ Petitioners***
AND
Premalatha Javar and Others ***...Defendants/ Respondents***
To:
Premalatha Javar, Hindu, age 58 yrs, D.No. 9-11-27, Opp: Ganesh Hotel, Isukaveedhi, Rajamahendravaram.

పై నెంబరు O.S. 525/2024 లో పిటీషనర్స్ ప్రతివాదులపై పై కోర్టులో పర్మినెంట్ ఇంజెక్షన్ దాఖలు చేయడమైనది. 1వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకోనందున పై కోర్టు వారు పేపరు ప్రకటన ఆర్డరు వేసియున్నారు. కావున **ది. 23-10-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **కె.ఎస్.భూలోకేశ్వరరావు (భూలోక్)**
13-10-2025 అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ కాకినాడ 6వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No.52/2025
OS.No.1181/2019
Between:-
యరమాటి సుబ్బన్నరావు చౌదరి వగైరా **... DHRs**
మరియు
పసల సత్యన్నారాయణ వగైరా **... JDRs**
To.
1వ JDR:- Pasala Satyanarayana, S/o.Veerraju 57years, Business, Resident of Flat No.301, ZOHA Residency, D.No.13-2-9, Latchiraju Street, Surya Rao Peta, Kakinada.
2వ JDR:- Pasala Baby Rani, W/o. Satyanarayana, 53years, House Wife, Resident of Flat No.301, ZOHA Residency, D.No.13-2-9, Latchiraju Street, Surya Rao Peta, Kakinada.
3వ JDR:- Pasala Priyanka, D/o. Satyanarayana 30years, Student, Resident of Flat No.301, ZOHA Residency, D.No.13-2-9, Latchiraju Street, Surya Rao Peta, Kakinada.

పై నెంబరు E.P. లో పైన తెలిపిన JDRs కు పై కోర్టు వారి ఆర్డరు ప్రకారం కోర్టు వారి ద్వారాను, పోస్టల్ ద్వారాను ఎన్నిసార్లు ఆర్డరు 21 రూల్ 64 మరియు 66 నోటీసులు(వేలం నోటీసులు) పంపించిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందు వలన సదరు పైన తెలిపిన 1టు3 JDRs పై కోర్టు వారి ఎదుట **ది.22-10-2025వ** తేది ఉదయం **గం॥10.30ని॥లకు** హాజరయి ఆక్షేపణలు వున్న ఎడల తెలియపర్చు కోవలెను. లేనిఎడల మీ పరోక్షమునందు తీర్మానించబడునని యిందుమూలముగా తెలియచేయడమైనది.
మెర్ల సూర్యనారాయణ
మల్లంపల్లి సర్వేశ్వరరావు
కాకినాడ అడ్వకేట్స్, కాకినాడ
09-10-2025 సెల్.9848265645

ప్రకటన
మహారాజశ్రీ కొవ్వూరు 9వ అడిషినల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
E.P.No. 53/2025 in A.C.No. 181/2023
M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
Formerly M/s. శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్
Co-Ltd. జంగారెడ్డిగూడెం బ్రాంచ్
Rep. by GPA Holder **...DHR**
Vs
గడిమి భానుశ్రీ **...JDR**
1st JDR:
గడిమి భానుశ్రీ, W/o. సురేంద్ర, వయస్సు 31 సం॥లు, స్త్రీ, D.No: 17-5A, రాములమ్మ చెలక, సాలిపేట, జంగారెడ్డిగూడెం.
వాయిదా: 22-10-2025

పై నెంబరు E.P లో 1st JDR అయిన మీ పై Award బాకీ రాబట్టుకొనే నిమిత్తం మీ తాలూకు E.P షెడ్యూలు ఆస్థి జప్తు చేయించమని దాఖలు చేసిన E.P లో U/R 21 Rule 54 CPC Notice కోర్టు ద్వారా Post ద్వారా పంపించియున్నాను. మీరు ఉద్దేశ్యపూర్వకంగా Avoid చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ నెంబరు EP లో 1st JDR అయిన మీరు **ది. 22-10-2025 వ తేదిన ఉదయం గం. 10:30 ని॥లకు** లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
M.S.S. CHAKRAPANI
కొవ్వూరు Advocates, Kovvur
ది. 13-10-2025 Cell: 93476 25845

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. 86/2022, O.S. 115/2022
Between:
పిటీషనరు(వాది):
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొవ్వూరు మెయిన్ బ్రాంచి, కొవ్వూరు
AND
రెస్పాండెంట్లు (ప్రతివాదులు):
శ్రీమతి కొచ్చెర్లకోట ఉష మరియు 2 ఇతరులు
To:
1. Kotcherlakota Usha, W/o. late Subrahmanyam, Door No. 3-92/1, Arikirevula, Kovvuru Mandal, E.G.Dist.,
2. Master K.L.S.Bhuvanesh, S/o. late Subrahmanyam.
3. Master K.S.P.Shanmukham, S/o. late Subrahmanyam.

2, 3 రెస్పాండెంట్లు (ప్రతివాదులు) మైనర్లు అయినందున గార్డియన్ తల్లి 1వ రెస్పాండెంటు (ప్రతివాది) శ్రీమతి కొచ్చెర్లకోట ఉష, W/o. late సుబ్రహ్మణ్యం, డోర్ నెం. 3-92/1, ఆరికిరేవుల, కొవ్వూరు మండలం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు పిటీషను I.A. 86/2022 ను పిటీషనరు (వాది) 1 టు 3 రెస్పాండెంట్లు (ప్రతివాదులు)పై 2, 3 రెస్పాండెంట్లుకి గార్డియన్‌గా 1వ రెస్పాండెంటుని Appoint చేయించమని 1వ రెస్పాండెంటు అందులకు అంగీకరించని యెడల కోర్టు గార్డియన్‌ను Appoint చేయించమని కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు 1 టు 3 రెస్పాండెంట్లుకి నోటీసులు బేటాలు కట్టినప్పటికిన్నీ మీకు అమలు కానందున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా ఆర్డరు వేసివున్నారు. కావున పై నెంబరు పిటీషనులో మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న ఎడల మీరు **ది. 28-10-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై తెలియపరచుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించడమగును.
MADDIPATI SRINIVAS, Advocate
Kovvur, Cell: 9346650165